TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 163   బుధవారం 05-02-2025   పేజీలు :06   వేల : 05/-

## ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ◆ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన



**హైదరాబాద్ ఫిబ్రవరి 04** : ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. అన్నీ రాష్ట్రాల కంటే ముందే వర్గీకరణను తామే అమలు చేస్తామని మరోసారి సీఎం ప్రకటించారు. వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశామని, ఆ కమిషన్ తాజాగా రిపోర్టు ఇచ్చిందని ఆయన చెప్పారు. ఆ కమిషన్ కూడా ఎస్సీ వర్గీకరణ చేయాలనే సిఫార్సు చేసినట్లు అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు తాము కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.తెలంగాణలో ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలను ఏకసభ్య కమిషన్ గుర్తించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వారిని మూడు గ్రూపులుగా వర్గీకరించాలని కమిషన్ సిఫార్సు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్సీలను గ్రూప్ 1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సూచించిందని, మొత్తం 15 శాతం రిజర్వేషన్లను 3 గ్రూపులకు పంచుతూ సిఫార్సు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రూప్-1లో 15 ఉప కులాలకు ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చెప్పినట్లు సీఎం పేర్కొన్నారు. ఆ 15 ఉపకులాల జనాభా 3.288 శాతంగా ఉందని ఆయన వెల్లడించారు. గ్రూప్-2లోని 18 ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్ చెప్పిందని, ఆ 18 ఉప కులాల జనాభా 62.748గా ఉందని సీఎం తెలిపారు. గ్రూప్-3లోని 26 ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్‌ను ఏకసభ్య కమిషన్ సిఫార్సు చేసినట్లు సీఎం చెప్పారు. ఈ 26 ఎస్సీ ఉప కులాల జనాభా 33.963 శాతంగా ఉందని పేర్కొన్నారు.

## యునైటెడ్ స్టేట్స్ (యుఎస్) వలస చట్టాలను కట్టుదిట్టం

## చేస్తోంది అక్రమ వలసదారులను పంపివేస్తునా భారత్ అమెరికన్

### రాయబార కార్యాలయం వెల్లడి

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 04** : యునైటెడ్ స్టేట్స్ (యుఎస్) వలస చట్టాలను కట్టుదిట్టం చేస్తోందని భారత్‌లోని అమెరికన్ రాయబార కార్యాలయం మంగళవారం తెలియజేసింది. యుఎస్ సైనిక విమానం ఒకటి కొంత మంది అక్రమ వలసదారులను భారత్‌కు తీసుకువస్తున్నదన్న వార్తల నడుమ దౌత్య కార్యాలయం ఆ వ్యాఖ్య చేసింది. డొనాల్డ్ ట్రంప్ రెండవ విడత యుఎస్ అధ్యక్షుడు అయిన తరువాత సుమారు రెండు వారాలకు యుఎస్ నుంచి అక్రమ భారతీయుల తరలింపు మొదటి రౌండ్ మొదలైంది. యుఎస్‌లో నివసిస్తున్న అక్రమ వలసదారుల విషయంలో కఠిన విధానాన్ని అనుసరిస్తామని ట్రంప్ వాగ్దానం చేశారు. తదనుగుణంగానే ఆయన అక్రమ వలసదారులకు సంబంధించిన కొన్ని కార్యనిర్వాహక ఉత్తర్వులపై ఇప్పటికే సంతకం చేశారు.భారత్‌కు అక్రమ వలసదారులు కొందరిని వెనుకకు తీసుకువస్తున్న విమానం గురించిన ప్రశ్నకు యుఎస్ ఎంబసీ అధికార ప్రతినిధి వివరాలు వెల్లడించలేదు, కానీ వాషింగ్టన్ అక్రమ వలసదారులను పంపివేస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. 'ఆ ప్రశ్నలకు ఎటువంటి వివరాలనూ ఇవ్వలేను, యుఎస్ తన సరిహద్దును గట్టిగా కాపాడుకుంటున్నది, వలస చట్టాలను కట్టుదిట్టం చేస్తున్నది, అక్రమ వలసదారులను తొలగిస్తున్నది అన్న సమాచారాన్ని ఇవ్వగలను' అని ఆ అధికారి తెలిపారు. 'అక్రమ వలస రిస్క్ తీసుకునేంతది కాదనే విస్పష్ట సందేశాన్ని ఈ చర్యలు పంపుతున్నాయి' అని ఆయన చెప్పారు. జనవరి 27న ప్రధాని నరేంద్ర మోడీతో ఫోన్ సంభాషణ అనంతరం యుఎస్ నుంచి అక్రమ వలసదారులను వెనుకకు రప్పించడంపై భారత్ 'ఏది సరైనదో అదే చేస్తుంది' అని ట్రంప్ ప్రకటించారు.అక్రమ వలసకు తాము వ్యతిరేకమని, యుఎస్‌లో అక్రమంగా బస చేస్తున్న భారతీయుల జాతీయతను ధ్రువీకరించినట్లయితే వారిని వెనుకకు రప్పించడానికి తాము సిద్ధమని విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) క్రితం నెల వెల్లడించింది. అక్రమ వలసదారులకు రకరకాల సంఘటిత నేరాలతో సంబంధం ఉన్న కారణంగా అక్రమ వలసను భారత్ వ్యతిరేకిస్తున్నదని ఎంఇఎ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ జనవరి 24న తెలిపారు. 'వారు నిజానికి భారతీయులు అని వారి జాతీయతను మేము ధ్రువీకరించడానికి వీలుగా పత్రాలను మాతో పంచుకున్నట్లయితే వారిని వెనుకకు తీసుకుంటాం' అని ఆయన తెలిపారు. అయితే, యుఎస్‌లో బస చేస్తున్న అక్రమ భారతీయ వలసదారుల సంఖ్య గురించి మాట్లాడడం 'తొందరపాటు' అవుతుందని జైశ్వాల్ అన్నారు.

## గుజరాత్‌లో ఏక శిక్షా స్మృతి (యుసిసి) మదింపు

## వేసేందుకు ముసాయిదా బిల్లు

### - సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు

**గాంధీనగర్ ఫిబ్రవరి 04** : గుజరాత్‌లో ఏక శిక్షా స్మృతి (యుసిసి) అవసరాన్ని మదింపు వేసేందుకు, ఒక ముసాయిదా బిల్లు రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు (ఎస్‌సి) విశ్రాంత న్యాయమూర్తి అధ్యక్షతన ఒక కమిటీని మంగళవారం ఏర్పాటు చేసింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా దేశాయ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల కమిటీ 45 రోజుల్లోగా తన నివేదికను సమర్పిస్తుందని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తెలియజేశారు. 'ఏక శిక్షా స్మృతి (యుసిసి) ఆవశ్యకతను మదింపు వేయడానికి, దానికి ఒక ముసాయిదా బిల్లు రూపొందించడానికి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన ఒక కమిటీ వేయాలని నిర్ణయించాం'అని ఆయన తెలిపారు. నివేదిక అందిన తరువాత యుసిసి అమలు గురించి రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుంది. కమిటీలోని ఇతర సభ్యులు విశ్రాంత ఐఎఎస్ అధికారి సిఎల్ మీనా, న్యాయవాది ఆర్‌సి కొడేకర్, సామాజిక కార్యకర్త గీతా ష్రాఫ్.



## ట్రంప్ మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధానికి చైనా నుంచి స్ట్రాంగ్ రియాక్షన్

## అమెరికా సంస్థలను విశ్వసనీయత లేనివాటి జాబితాలో చేర్చిన చైనా

### ట్రేడ్ వార్ లో మొదలయిన భయాలు

**న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 04** : అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధానికి చైనా నుంచి స్ట్రాంగ్ రియాక్షన్ వచ్చింది. చైనా నుంచి వచ్చే అన్ని ఉత్పత్తులపై 10 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేయగా, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే బొగ్గు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్టు చైనా ప్రకటించింది. చమురు, వ్యవసాయ పరికరాలపై ఆ టారిఫ్ 10 శాతం ఉంటుందని స్పష్టం చేసింది. టంగ్‌స్టన్ సంబంధిత పదార్థాల ఎగుమతులపై నియంత్రణ విధించింది. పీవీహెచ్ కార్పొరేషన్, ఇల్యుమినా ఇంక్ వంటి అమెరికా సంస్థలను విశ్వసనీయత లేనివాటి జాబితాలో చేర్చింది.ఇదే కాకుండా అనైతిక వ్యాపార పద్ధతులు అవలంబిస్తున్న అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం గూగుల్ పైనా చైనా విచారణ జరపనుంది. ఈ రెండు పెద్ద దేశాలు ఒకదానిపై ఒకటి సుంకాలు విధించుకోవడంతో ట్రేడ్ వార్ భయాలు మొదలయ్యాయి. ఇప్పటికే చైనా కరెన్సీ యువాన్ విలువ పతనమైంది. ఆ ప్రభావం ఇతర దేశాల కరెన్సీల పైనా పడింది. ఆస్ట్రేలియా డాలర్, న్యూజిలాండ్ డాలర్ విలువలు పడిపోయాయి.డబ్లుటీవోలో సవాలు ట్రంప్ సుంకాలు విధించడంపై ఇప్పటికే చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ మండిపడింది. దాన్ని డబ్లుటీవోలో సవాలు చేస్తామని ప్రకటించింది. తమ దేశ ప్రయోజనాలు, హక్కులు కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారీ బెదిరించకుండా , ఫెంటానిల్ లాంటి సమస్యలను సొంతంగా పరిష్కరించుకోవాలని అమెరికాకు చైనా హితవు పలికింది. తాజాగా సుంకాల రూపంలో కౌంటర్ ఇచ్చింది.



## కుంభమేళ భద్రత ఏర్పాట్లు బేష్..

### కోవూరి సత్యనారాయణ గౌడ్

**ప్రయాగ్రాజ్ ఫిబ్రవరి 04** : ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సూచనల మేరకు ప్రయాగ కుంభమేళకు విచ్చేయుచున్న భక్తులు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సూచనలను అందరికీ అనుకూలంగా ఉన్నాయని బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే,ఎంపీ న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ తెలిపారు, కోట్లాదిమంది భక్తులకు మంచి సౌకర్యాలను, భద్రతను ఏర్పాటుచేసిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఏసీపి సూచనల మేరకు ఉత్తరప్రదేశ్, ప్రయాగ్రాజ్ కుంభమేళ త్రివేణి సంగమం క్షేత్రాన్ని దర్శించుకుని కుంభమేళ స్నానాలు చేయడానికి సంపూర్ణంగా సహకరిస్తున్న చంద్రశేఖర్ సింహ సీఐ స్పెషల్ గాడ్ పోలీస్ సిబ్బందితో సెక్టార్ 4 వ ఘాట్లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ ప్రయాగ కుంభమేళా త్రివేణి సంగమంలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు బసగళ్ల రాములు గౌడ్, బీసీ నాయకులు, గౌడ సంక్షేమ సంఘం నాయకులు మెదక్ రవీందర్ గౌడ్, మాణిక్యం గౌడ్, సినీ పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్ గౌడ్ మరియు వివిధ రాష్ట్రాల నుండి దేశ విదేశాల నుండి కోట్లాది సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# మాది ముగ్గురు సభ్యుల వ్యవస్థ

## ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చేసిన ఆరోపణలను తిప్పికొట్టిన ఇసి




**న్యూఢిల్లీ ఫిబ్రవరి 04 :** ఎన్నికల కమిషన్ (ఇసి)ని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ నడుపుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చేసిన ఆరోపణలను ఇసి మంగళవారం తిప్పికొట్టింది. తమది ముగ్గురు సభ్యుల సంస్థ అని ఇసి సుస్పష్టం చేసింది. ఢిల్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్‌ను అపఖ్యాతి పాలుజేయడానికి ఆప్ 'పదే పదే ఉద్దేశపూర్వకంగా పాల్పడుతున్న ఒత్తిడి ఎత్తుగడలను' తాము ఉమ్మడిగా గమనించామని ఇసి తెలియజేసింది. ఇసి ఏక సభ్య సంస్థ అనే అభిప్రాయాన్ని సృష్టిస్తున్నారని కమిషన్ విమర్శించింది.'రాజ్యాంగబద్ధమైన సంయమనం పాటించాలని తాము నిర్ణయించుకున్నామని, అటువంటి విమర్శలను తెలివిగా దిగమింగుకుంటున్నామని, అటువంటి నిందారోపణలకు ప్రభావితం కారాదని నిర్ణయించుకున్నామని ఇసి 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో తెలిపింది. బిజెపి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనను ఇసి అలక్షం చేస్తోందని ఆప్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ సహా పార్టీ అగ్ర నాయకులు ఆరోపించారు. రిటైర్‌మెంట్ అనంతర బాధ్యత స్వీకారం ఉద్దేశంతో రాజీవ్ కుమార్ బిజెపిపై చర్య తీసుకోవడం లేదని కేజ్రీవాల్ ఆరోపించారు. రాజీవ్ కుమార్ 65వ ఏట ప్రవేశించిన మీదట ఈ నెల 18న పదవీ విరమణ చేయనున్నారు. జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఇతర ఎన్నికల కమిషనర్లు.'ఇసిఐ ఏక సభ్య సంస్థ అన్నట్లుగా ఢిల్లీ ఎన్నికల్లో ఇసిఐని అపఖ్యాతి పాలుజేయడానికి పదే పదే పాల్పడుతున్న ఒత్తిడి ఎత్తుగడలను ముగ్గురు సభ్యుల కమిషన్ ఉమ్మడిగా గమనించింది, అటువంటి విమర్శలను తెలివిగా దిగమింగుకుంటూ రాజ్యాంగబద్ధమైన సంయమనం పాటించాలని, అటువంటి నిందారోపణలకు ప్రభావితం కారాదని నిర్ణయించుకున్నాం' అని ఎన్నికల కమిషన్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేసింది. కమిషన్ ఈ విధంగా స్పందించడం అరుదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఆప్ అధికారం నిలబెట్టుకోవాలని ఆశిస్తుండగా, తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బిజెపి వాంఛిస్తోంది.

# కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బిగ్ షాక్

## పార్టీ మారిన పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసులు

**హైదరాబాద్ ఫిబ్రవరి 04 :** కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బిగ్ షాక్ తగిలింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో మంగళవారం శాసనసభ కార్యదర్శి పార్టీ మారిన పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసులు పంపించారు. పార్టీ ఫిరాయింపులపై బిఆర్ఎస్ వేసిన అనర్హత పిటిషన్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని అసెంబ్లీ సెక్రెటరీ నోటీసులో పేర్కొన్నారు. అయితే, వివరణ ఇచ్చేందుకు తమకు కొంత సమయం కావాలని ఎమ్మెల్యేలు కోరినట్లు సమాచారం.కాగా, 2024లో అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిపోవడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలె యాదయ్య, తెల్లం వెంకట్రావు, సంజయ్ కుమార్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలు ..కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే.



# ప్రజావాణికి 7,142 దరఖాస్తులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 04 :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 7142 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 175, విద్యుత్ శాఖ కు సంబంధించి 135, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 46, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 01, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 4860 దరఖాస్తులు వచ్చాయి, పౌర సరఫరాల శాఖ కు సంబంధించి 1861 (రేషన్ కార్డులు) దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

# అమెరికాపై ప్రపంచ దేశాలు ఒత్తిడి తేవాలి




**జెనీవా :** ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నుండి వైదొలగాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా అమెరికాపై ఒత్తిడి తీసుకురావాలని డబ్ల్యుహెచ్ఓ చీఫ్ డాక్టర్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ ప్రపంచ నేతలను కోరారు. గత వారం ప్రపంచ దేశాల దౌత్యవేత్తలతో జరిపిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డబ్ల్యుహెచ్ఓకు అతిపెద్ద మొత్తంలో నిధులు అందించే అమెరికా బయటకు వెళ్ళిపోవడం వల్ల తలెత్తే పరిస్థితులను ఎలా సద్దుబాటు చేస్తారో వివరించాలంటూ పలు దేశాలు గత బుధవారం నాటి కీలక బడ్జెట్ సమావేశంలో డబ్ల్యుహెచ్ఓను కోరాయి. ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా వుంది. సాధ్యమైనంత త్వరలో మనం ఆ పరిస్థితులను నివారించాలని జర్మనీ దౌత్యవేత్త బిజోర్న్ కమెల్ హెచ్చరించారు. 2024-25 సంవత్సరానికి డబ్ల్యుహెచ్ఓకు అమెరికానే అతిపెద్ద విరాళాలు అందించే దేశంగా వుంది. 690కోట్ల డాలర్ల డబ్ల్యుహెచ్ఓ బడ్జెట్‌లో 98.8 బిలియన్లు అంటే దాదాపు 14శాతం అమెరికానే అందిస్తోంది. తాజాగా అమెరికా నిర్ణయం వల్ల డబ్ల్యుహెచ్ఓ ఆరోగ్య అత్యవసర కార్యక్రమాలు ప్రమాదంలో పడనున్నాయి. ఆనాటి బడ్జెట్ సమావేశంలో డబ్ల్యుహెచ్ఓ ఆరోగ్య అత్యవసర కార్యక్రమాలను పరిశీలించినట్లైతే అమెరికా నగదుపైనే భారీగా ఆధారపడినట్లు తెలుస్తోంది. డబ్ల్యుహెచ్ఓ యూరప్ కార్యాలయంలోని కార్యకలాపాల్లో 80శాతానికి పైగా కార్యకలాపాలు అమెరికా విరాళాలపైనే ఆధారపడ్డాయి. దాదాపు 40శాతం అత్యవసర కార్యకలాపాలకు అమెరికా నిధులే అందుతాయి. తాజా చర్యల వల్ల మధ్య ప్రాచ్యం, ఉక్రెయిన్, సూడాన్‌ల్లో అత్యవసర ప్రతిస్పందనా చర్యలు ప్రమాదంలో పడతాయని ఆ బడ్జెట్ డాక్యుమెంట్ హెచ్చరించింది. యూరప్‌లో డబ్ల్యుహెచ్ఓ చేపట్టే క్షయవ్యాధి నివారణా కార్యకలాపాల్లో 95శాతం అమెరికా నిధులతోనే జరుగుతాయి.

# బాధ వున్నా భరించక తప్పదు..!

## టారిఫ్‌ల చర్యలపై అమెరికన్లకు ట్రంప్ సూచనలు



**పామ్ బీచ్ :** కెనడా, మెక్సికో, చైనాలపై తాను విధించిన అదనపు టారిఫ్‌ల వల్ల తలెత్తిన వాణిజ్య యుద్ధంతో అమెరికన్లకు కొంచెం బాధ కలుగుతుందని, కానీ వారు ఆ భారాన్ని మోయక తప్పదని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. 'బాధ వుంటే వుండొచ్చు, కానీ అమెరికాను మళ్ళీ మహత్తర దేశంగా మేం తీర్చి దిద్దుతాం. చెల్లించాల్సిన ధరకు ఇది పూర్తి విలువను కలిగి వుంటుంది. అని ట్రంప్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య మిగులు లేకుండా కెనడా ఉనికిలో వుండబోదని వ్యాఖ్యానించారు. మంగళవారం నుండే ఈ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. ఆ మూడు దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ ట్రంప్ తీసుకున్న చర్యలతో దశాబ్దాలుగా ఉత్తర అమెరికాలో సాగుతున్న వాణిజ్య బంధాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. తీవ్రమైన ఆగ్రహావేశాలు, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. చైనాతో సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ఇంకా తీవ్రమైన దిగుమతి సుంకాలు విధించే అవకాశం వుందని హెచ్చరించారు. యురోపియన్ యూనియన్‌పై కచ్చితంగా దిగుమతి సుంకాలు వుంటాయని, బ్రిటన్‌తో కూడా వుండే అవకాశం లేకపోలేదని ఆయన విలేకర్లతో అన్నారు. కెనడా నుండి ప్రతీకార చర్యలు ఎదురయ్యే అవకాశాలను తోసిపుచ్చారు. "వారు ఆట ఆడాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు. వారు కావాలనుకునే ఆటలన్నింటినీ మేం ఆడగలం." అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఫ్లోరిడా నుండి వాషింగ్టన్‌కు తిరిగి వచ్చిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, టారిఫ్‌లను ఎత్తివేయడానికి గానూ కెనడా, మెక్సికోలతో వాణిజ్య అసమాతనలను కూడా తుడిచిపెట్టాల్సిన అవసరం వుందని అన్నారు. తాజాగా తాను తీసుకున్న చర్యల వల్ల తలెత్తే ద్రవ్యోల్బణం గురించి వివరణ ఇస్తూ, స్వల్ప కాల వ్యవధిలో మనకు కొంత బాధ వుండొచ్చు, కానీ ప్రజలు దాన్ని అర్థం చేసుకుంటారు, కానీ, దీర్ఘకాలంలో అమెరికాను దాదాపు ప్రపంచంలోని ప్రతీ దేశమూ మోసగించిందని ఆయన వ్యాఖ్యానించారు.

# ఉత్తర సిరియాలో కారు బాంబు పేలుడు



**డమాస్కస్ :** ఉత్తర సిరియాలోని మన్‌బిజ్ నగర శివార్లలో కారు బాంబు పేలిన ఘటనలో 15మంది మరణించగా, మరో 15 మంది గాయపడ్డారు. వ్యవసాయ కూలీలను తీసుకెళుతున్న వాహనానికి పక్కనే గల కారును బాంబులతో పేల్చివేయడంతో 14మంది మహిళలు, ఒక పురుషుడు మరణించారని స్థానిక పౌర రక్షణ దళాలు తెలిపాయి. మరో 15మంది మహిళలు గాయపడ్డారని, వారిలో కొందరి పరిస్థితి విషమంగా వుందని వెల్లడించాయి. అయితే ఈ దాడిలో 18మంది మహిళలు, ఒక పురుషుడు మరణించారని సిరియా మానవ హక్కుల పర్యవేక్షణా సంస్థ వెల్లడించింది. అలాగే, కేవలం నెల రోజుల వ్యవధిలో మన్‌జిబ్ నగరంలో ఇది ఏడవ కారు బాంబు పేలుడు ఘటన అని పౌర రక్షణ దళాల డిప్యూటీ డైరెక్టర్ మునీర్ ముస్తఫా తెలిపారు. ఇలా వరుస దాడులు జరుగుతుంటే సిరియాలో యుద్ధానంతరం చేపడుతున్న భద్రత, ఆర్థిక పునరుద్ధరణ కార్యకలాపాలు నిలిచిపోతాయని ఆయన హెచ్చరించారు. డిసెంబరులో అసద్ ప్రభుత్వం పడిపోయిన తర్వాత కూడా మన్‌జిబ్ నగరంలో హింస కొనసాగుతునే వుంది. శనివారం జరిగిన మరో కారు బాంబు పేలుడలో నలుగురు పౌరులు మరణించగా 9మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

# డబ్ల్యుటిఓలో తేల్చుకుంటాం...ట్రంప్ టారిఫ్‌లపై చైనా

**బీజింగ్ :** చైనా నుండి దిగుమతయ్యే వస్తువులపై 10శాతం అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ తీసుకున్న చర్యలను చైనా తీవ్రంగా ఖండించింది. తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలు పరిరక్షించుకునేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని స్పష్టం చేసింది. ట్రంప్ చర్యలను చైనా విదేశాంగ, వాణిజ్య శాఖలు తీవ్రంగా వ్యతిరేకించాయి. "చైనా వైఖరి చాలా దృఢంగా, స్థిరంగా వుంది. వాణిజ్యం, టారిఫ్‌ల యుద్ధంలో విజేత అంటూ ఎవరూ వుండరు." అని విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ వ్యాఖ్యానించారు. అమెరికా ఏకపక్షంగా తీసుకున్న ఈ టారిఫ్‌ల చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని అన్నారు. ఈ చర్యలతో దేశీయంగా అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావని అన్నారు. పైగా, ఈ చర్యల వల్ల ఉభయ పక్షాలకూ ఎలాంటి ప్రయోజనం ఒనగూడదని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రయోజనాలు అసలే నెరవేరవని అన్నారు. పెంటనిల్ అనేది అమెరికా సమస్య అని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల నిరోధానికి అమెరికాతో సహకరిస్తున్నామని, గణనీయమైన ఫలితాలు కూడా వచ్చాయని చెప్పారు. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. చైనాపై అమెరికా తీసుకున్న చర్యలతో తాము తీవ్ర అసంతృప్తికి గురయ్యామని చైనా వాణిజ్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ చర్యలను ఖండిస్తున్నామని తెలిపింది. అమెరికా తీసుకున్న తప్పుడు చర్యలకు ప్రతిస్పందనగా డబ్ల్యుటిఓలో చైనా ఫిర్యాదు చేస్తుందని, చైనా ప్రయోజనాలు, హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు వాణిజ్య శాఖ కూడా ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. ఇతర దేశాలపై టారిఫ్‌లను విధిస్తామని తరచుగా బెదిరించడం కన్నా ఫెంటనిల్, అందుకు సంబంధించిన అంశాలను హేతుబద్ధంగా, నిష్పక్షపాతంగా చూసి, పరిష్కరించాల్సి వుందని అమెరికాను చైనా కోరింది. ఘర్షణలను మరింత పెంచకుండా నివారించడానికి అమెరికాతో చర్చలకు తలుపులు తెరిచే వున్నాయని పేర్కొంది. ఎలాంటి అరమరికలు లేని రీతిలో చర్చలు జరిపి, సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని కోరింది.



# కాంగోలో భీకర యుద్ధం..

గోమా : కాంగో సైన్యం, రువాండా మద్దతున్న ఎం23 తీవ్రవాదుల మధ్య భీకర యుద్ధం సాగుతోందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఈ పోరాటంలో కనీసం 700 మంది చనిపోగా మూడు వేల మంది వరకు గాయాలపాలయ్యారని పేర్కొంది. ఇప్పటికే గోమా నగరాన్ని, ఒక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని స్వాధీనం చేసుకున్న తీవ్రవాదులు దక్షిణాన ఉన్న కివు ప్రావిన్స్‌లోకి శరవేగంగా చొచ్చుకు వస్తున్నారని వెల్లడించింది. ఈ క్రమంలో జరుగుతున్న పోరులో భారీగా ప్రాణనష్టం సంభవించిందని వివరించింది. తీవ్రవాదులు మరో విమానాశ్రయాన్ని కూడా స్వాధీనం చేసుకునే ప్రమాదముందని హెచ్చరించింది. దక్షిణ కివు ప్రావిన్స్‌లోని కొన్ని గ్రామాలను ఆర్మీ తిరిగి స్వాధీనం చేసుకున్నారని ఐరాస పేర్కొంది. గోమా తీవ్రవాదుల వశం కావడంతో విదేశీ సాయుధ ముఠాలు లొంగుబాట పట్టడం, పెద్ద సంఖ్యలో సైనికులు చనిపోవడంతో కాంగో ఆర్మీ బలహీనపడిందని వివరించింది. కాంగోలోని సాయుధ గ్రూపుల్లో ఎం23యే అతిపెద్దది.

# స్వతంత్ర బలంపై దృష్టి వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు కృషి



**న్యూఢిల్లీ :** పార్టీ స్వతంత్ర బలం పెంచుకునేందుకు తగిన వ్యూహాన్ని రూపొందించడంపై దృష్టిసారించనున్నట్లు సిపిఎం ముసాయిదా రాజకీయ తీర్మానం ఉద్ఘాటించింది. ఏప్రిల్ 2 - 6 తేదీల మధ్య మదురైలో జరగనున్న సిపిఎం 24వ అఖిల భారత మహాసభ ముందు ఉంచడం కోసం రూపొందించిన ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని పార్టీ సభ్యులు, ప్రజల పరిశీలన, సూచనలు, సవరణలు, సలహాల నిమిత్తం సోమవారం నాడిక్కడ సిపిఎం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ విడుదల చేశారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై సైద్ధాంతిక పోరాటం కొనసాగుతుందని ఆయన మీడియాకు తెలిపారు. ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక ఓట్లను వీలైనంత ఎక్కువగా సంఘటితం చేసేందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలతో కలుపుకుని విశాల వేదిక ఏర్పాటు కోసం కృషి కొనసాగుతుందని చెప్పారు. ఇది ఇండియా బ్లాక్‌కు మాత్రమే పరిమితం కాదని, ఇంతకుమించిన వేదిక ఏర్పడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ అంశానికి సంబంధించి గత మహాసభలో తీసుకున్న విధానంలో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవని చెప్పారు. వామపక్షాల ఐక్యతను పటిష్టపరుచుకోవడానికి ముసాయిదా రాజకీయ తీర్మానం పిలుపునిస్తోందని అన్నారు. లౌకిక, ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని విశాలమైన వేదిక ఏర్పాటుకు కృషి కొనసాగుతోందని చెప్పారు. త్రిపుర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో పార్టీ తిరిగి పుంజుకునేందుకు కృషి చేస్తామన్నారు. జనవరి 17 నుంచి మూడు రోజులపాటు కొల్‌కతాలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని ఖరారు చేశామని తెలిపారు. ముసాయిదా తీర్మానంపై వచ్చే సూచనలు, సవరణలు పరిశీలించి మార్చి 22, 23 తేదీల్లో కేంద్ర కమిటీ తుది ముసాయిదాను రూపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు తపన్‌సేన్, అశోక్‌దావలే, నీలోత్పల్ బసు పాల్గొన్నారు.

# రాజస్థాన్‌లోనూ మతమార్పిడి నిరోధక బిల్లు



**జైపూర్ :** రాజస్థాన్‌లోనూ మత మార్పిడులను నిరోధించే బిల్లును తీసుకొచ్చారు. సోమవారం అంసెబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును భజన్ లాల్ శర్మ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాజస్థాన్ చట్టవిరుద్ధ మతమార్పిడి నిషేధ బిల్లు 2024 (రాజస్థాన్ ప్రోహిబిషన్ ఆఫ్ అన్ లాఫుల్ కన్వర్షన్ ఆఫ్ రిలిజియన్ బిల్లు 2025) ను మంగళవారం అసెంబ్లీలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గజేంద్ర సింగ్ ఖింవ్సార్ ప్రవేశపెట్టారు. గతేడాది అంటే 2024 నవంబర్‌లో ఈ బిల్లు ముసాయిదాను కేబినెట్ ఆమోదించింది. ఈ బిల్లు ప్రకారం మత మార్పిడి చేసుకోవాలని నిర్ణయించుకున్నవారు దాదాపు రెండు నెలల ముందు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ క్రమంలో తాము మత మార్పిడి చేసుకోవాలని తమ సొంతంగా నిర్ణయం తీసుకున్నామని జిల్లా ఉన్నతాధికారి ముందు ఒప్పుకోవాల్సి ఉంది. ఇందులో ఎవరి బలవంతం కానీ.. ఎవరి ప్రోద్బలం కానీ లేదని తెలుపాలి. అనంతరం మత మార్పిడికి అనుమతి లభిస్తుంది.ఒకవేళ షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన వారితోపాటు మహిళలు, మైనర్లను బలవంతంగా మత మార్పిడులకు ప్రోత్సహిస్తే.. రెండు నుంచి 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.25 వేల వరకు జరిమానా సైతం విధించే విధంగా ఈ బిల్లును రూపొందించారు. ఈ బిల్లును ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బిజెపి చేస్తున్న ప్రచారంలో ఇది భాగమని విమర్శించింది. కాగా, ఇప్పటికే కొన్ని బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మత మార్పడి నిరోధక బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే.

# అక్రమవలసల పేరుతో ట్రంప్ అమానుష ప్రవర్తన

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం రోజే అక్రమ వలసల్ని నిలువరిస్తామని, అమెరికా చరిత్రలోనే అతి పెద్దదైన 'బహిష్కరణ' ప్రక్రియను ప్రారంభిస్తామని గట్టిగా చెప్పారు. తాజాగా ట్రంప్ వ్యాఖ్యలు ఆచరణరూపం దాల్చాయి. అమెరికాలో ఉన్న భారతీయ అక్రమ వలసదారుల్ని ట్రంప్ ప్రభుత్వం సి-17 మిలటరీ విమానంలో పంపిస్తోంది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖా కార్యదర్శి మార్కో రూబియా సోమవారం తెలిపారు. అయితే వలసదారులతో విమానం బయలుదేరింది కానీ.. 24 గంటలైనా.. విమానం తిరిగి రాలేదు అని అమెరికా న్యూస్ ఏజెన్సీ రాయిటర్స్‌కి ఓ అధికారి తెలిపారు. అయితే అమెరికాలోని భారతీయుల్ని బహిష్కరించడంపై మార్కో రూబియో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ, భారత విదేశాంగ శాఖామంత్రి ఎస్ జైశంకర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో త్వరలో చర్చలు జరపనున్నారని ఆయన అన్నారు. కాగా, ఈ అక్రమ వలసదారుల బహిష్కరణ ప్రక్రియకు అమెరికా పరిపాలనా యంత్రాగం మిలటరీ సహాయాన్ని కోరింది. దీంతో వలసదారులను సైనిక విమానాల వారి స్వదేశాలకు పంపించే ప్రయత్నం జరుగుతోంది.

# అక్రమంగా భారత్‌లో చొరబడి నివసిస్తున్న వారిని వెనక్కి పంపకుండా కాలయాపన



**డిల్లీ :** అక్రమంగా భారత్‌లో చొరబడి నివసిస్తున్నవారిని వెనక్కి పంపకుండా కాలయాపన చేస్తున్న అస్సాం ప్రభుత్వంపై ఏకంగా సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికాలో వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అక్కడే ఉంటున్నవారితో పాటు అక్రమ మార్గాల్లో ఆ దేశంలోకి చొరబడి స్థానిక అమెరికన్ల అవకాశాలను కొల్లగొడుతున్నవారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారందరినీ వెనక్కి పంపి స్థానిక అమెరికన్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానంటూ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ట్రంప్, అధికారంలోకి వచ్చిన మర్నాటి నుంచే ఏరివేత కార్యక్రమం చేపట్టారు. అలా ఆ దేశంలో అక్రమంగా నివసిస్తున్నవారిలో సుమారు 18,000 మంది భారతీయులు ఉన్నారని అమెరికన్ ప్రభుత్వ సంస్థలు గుర్తించాయి. వారందరినీ డిటెన్షన్ సెంటర్లలో పెట్టిన అమెరికా, 205 మందిని మిలటరీ విమానం సీ-17లో ఎక్కించి భారత్‌కు వెనక్కి పంపించింది. టెక్సాస్ నుంచి బయలుదేరిన ఆ విమానం భారత్‌లోని అమృత్‌సర్ చేరుకుంది.నిజానికి భారతీయులను ప్రపంచవ్యాప్తంగా "మోస్ట్ యాక్సెప్టబుల్ కమ్యూనిటీ"గా చెబుతుంటారు. అంటే ఏ దేశానికి వెళ్లినా సరే.. భారతీయులు అక్కడి సంస్కృతి, సాంప్రదాయాలను, చట్టాలను గౌరవిస్తూ.. తమ సంస్కృతిని సైతం కాపాడుకుంటూ జీవనం గడుపుతుంటారు. భారతీయుల కారణంగా స్థానికంగా ఆయా దేశాల్లోని యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయి తప్ప శాంతిభద్రతల పరంగా ఎన్నడూ విఘాతం కల్గించిన దాఖలాలు లేవు. అదే పాకిస్తాన్, సిరియా, ఇరాన్, ఇరాఖ్ వంటి మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాల నుంచి శరణార్థులుగా యూరప్ దేశాలకు వెళ్లినవారు శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ.. అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతూ అక్కడి సమాజంలో అలజడి సృష్టిస్తున్నారు. కొందరైతే ఏకంగా మతోన్మాదంతో ఉగ్రవాద చర్యలకు సైతం తెగబడుతూ మారణహోమాలు సృష్టిస్తున్నారు. ఈ తరహా పరిస్థితులు భారతీయుల కారణంగా తలెత్తలేదు. అయితే అక్రమమార్గాల్లో ఏ దేశానికి ఎవరు వెళ్లినా అది చట్ట విరుద్ధమే. అలా వెళ్లి అమెరికాలో ఉంటున్న భారతీయల విషయంలో భారత ప్రభుత్వం సైతం అమెరికా ప్రభుత్వానికి సహకరిస్తామని ప్రకటించింది. కానీ భారత్‌లోకి అక్రమంగా చొరబడి నివసిస్తున్నవారి విషయంలో ఏం చేస్తోంది? ఇదే ప్రశ్న ఇప్పుడు సుప్రీంకోర్టు సంధించింది.

# మహా కుంభమేళా తొక్కిసలాటపై గందరగోళం

## ప్రతిపక్షాల ఆందోళన, వాకౌట్



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మూడో రోజు ప్రతిపక్షాల ఆందోళనలతో ఉభయ సభలు ప్రారంభమ య్యాయి. సోమవారం సమావేశాల్లో ప్రతిపక్ష ఎంపిలు మహా కుంభమేళా విషాదంపై లోక్‌సభలో చర్చకు పట్టుబట్టారు. ప్రతిపక్ష సభ్యులు, ప్రశ్నోత్తరాలను సస్పెండ్ చేసి, గత నెల 29న ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే తొక్కిసలాటలో మరణించిన వారి పూర్తి జాబితాను విడుదల చేయాలని నినదించారు. అనంతరం సభ్యులు సభలోని వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. విపక్షాల ఆందోళనపై స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. "ప్రజలు మిమ్మల్ని ఎంపిలుగా ఎన్నుకున్నది. నినాదాలు చేయడం, సభా కార్యకలాపాలకు భంగం కలిగించడం, బల్లలు పగలగొట్టేందుకా?" అని మండి పడ్డారు. అయినా ప్రతిపక్ష ఎంపిలు 'తానాషాహీ నహీ చలేగీ' అని నినాదాలతో హోరెత్తించారు. ప్రతిపక్ష ఎంపిలు ప్రశ్నలు లేవనెత్తడానికి కూడాస్పీకర్ అవకాశం ఇవ్వాలన్నారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష ఎంపిలకు మరోసారి విజ్ఞప్తి చేస్తూ "దయచేసి ప్రశ్నోత్తరాల సమయానికి అంతరాయం కలిగించకండి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ప్రతి ఎంపి తమ అభిప్రాయం చెప్పేందుకు అవకాశం ఇస్తాం' అని అన్నారు. గందరగోళం మధ్యే లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయం ముగిసింది. ప్రశ్నోత్తరలు ముగిసిన తరువాత కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎస్‌పి సహా ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు.

# విభజన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోండి

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య అపరిషతంగా ఉన్న విభజన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ అంశాలపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తే సమస్యలు మరింత జఠిలమయి ఆలస్యం అవుతుందని సూచించింది. రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలపై సోమవారం కేంద్ర హోం శాఖ సెక్రటరీ గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక భేటి జరిగింది. ఈ భేటిలో ఇరు రాష్ట్రాల సిఎస్ లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ భేటిలో%ా% కీలకంగా విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్ లోని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో ప్రధానంగా అప్పులు, ఆస్తుల పై సవిరంగా చర్చ చేసినట్లు సమాచారం. అయితే%ా% ఈ రెండు షెడ్యూల్ లకు సంబంధించిన 20 సంస్థల నిధుల పంపకంపై సానుకూలంగా ఉండాలని కేంద్రం సూచించింది. వీటిపై రెండు రాష్ట్రాలు సానుకూల వాతావరణంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్ర హోం శాఖ సెక్రటరీ సూచించారు. అవసరమైతే దష్టికి అంశాల వారిగా సమస్యలను రెండు రాష్ట్రాల సిఎంల తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని చెప్పినట్లు తెలిసింది. విదేశీ అప్పుల పంపకంపై రెండు రాష్ట్రాల సిఎస్ లకు కేంద్రం సూచనలు చేసింది. ఈ అప్పులపై న్యాయ సలహా తో ముందుకెళ్లాలని దిశా నిర్దేశం చేసింది. ఇందుకు ఇరు రాష్ట్రాలు అంగీకారం చెబుతూనే అడ్వకేట్ జనరల్ తో (ఎజి)లతో చర్చించి, అభిప్రాయం తీసుకుంటామని రాష్ట్ర అధికారులు బదులిచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఎజి అభిప్రాయాల తర్వాత మరోసారి భేటి అయి, నిర్ణయం తీసుకుందామని కేంద్ర సెక్రటరీ చెప్పారని తెలిసింది. అయితే తాజా మీటింగ్ లోని అంశాలను సిఎం దృష్టికి తీసుకెళ్లి, తదుపరి మీటింగ్ కు హాజరవుతామని అధికారులు తెలిపారు.

# వెల్లివిరిసిన మత సామరస్యం



**ప్రయాగ్‌రాజ్ :** దేశంలో కుల, మత రాజకీయాలు పెట్రేగుతున్న వేళ.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో మత సామరస్యం వెల్లివిరిస్తోంది. పుణ్య స్నానాల కోసం కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తుండగా అక్కడి యోగి సర్కార్ ఏర్పాటు చేసిన(మరుగుదొడ్లు, ఇతర) సహాయక కార్యక్రమాలు ఆశించిన మేర సరిపోవడం లేదు. దీంతో ఇది ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. ఇలాంటి సమయంలో అక్కడి ముస్లింలు ముందుకొచ్చి సాయమందిస్తున్నారు. సుదూర ప్రాంతాలనుంచి కుంభమేళాకు వచ్చిన వారికి తాగునీరు, కాలకృత్యాలు తీర్చుకోవటం పెద్ద సమస్యగా మారింది. ఇక మహిళల అవస్థలైతే చెప్పలేనివి. ఇవన్నీ గుర్తించిన ప్రయాగ్‌రాజ్‌లోని ముస్లింలు.. తామున్నామంటూ ముందుకొచ్చారు. తమ వంతు సహాయ సహకారాలందిస్తున్నారు. సాధారణంగా హిందూ ఆలయాల్లో ముస్లింలను అనుమతించరు. కానీ ఇక్కడ సీన్ మరోలా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన కార్యక్రమం జరుగుతుంటే.. సర్కారు అందించే సేవలు మాత్రం అంతంతగానే ఉండడంతో ముస్లింలు .. మసీదుల్లో, తమ ఇళ్లలో హిందు భక్తులకు ఆశ్రయమిస్తున్నారు. శీతాకాలం కావటం%ా% మంచుకురుస్తుండడంతో పిల్లలు, మహిళలు వణికిపోతున్నారు. కాస్తంతా చోటు దొరికితే చాలు అనుకుంటున్న వారికి, తమ స్థోమతకు తగ్గట్టు ముస్లింలు వసతి సౌకర్యం కల్పించడంతో పాటు భోజనాలు, దుప్పట్లు, కంబలి ఇలా ఏది ఉంటే అది ఇచ్చి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. దేశమంతటా మతరాజకీయాల చిచ్చు పెరుగుతున్న సమయంలో మాకు ఇంతలా సేవలందిస్తారని ఊహించలేదని పలువురు పేర్కొనటం గమనార్హం. అక్కడ ముస్లింలు అందిస్తున్న ఈ సేవలను స్థానిక కార్పొరేట్ మీడియా మరుగునబెడితే..బిబిసి, ఇతర అంతర్జాతీయ మీడియా హైలెట్ చేయటం విశేషం.

# యుఎస్ ఎయిడ్ సంస్థకు తాళాలు

**వాషింగ్టన్ :** అంతర్జాతీయ అభివృద్ధికి సాయమందించే సంస్థ యుఎస్‌ఎయిడ్ సిబ్బందిని వాషింగ్టన్‌లోని ప్రధాన కార్యాలయానికి వెలుపల వుండా ల్సిందిగా సోమవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు వారికి నోటీసులు అందచేశారు. సంస్థను మూసివేసేం దుకు అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారని ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఆ తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సంస్థలోని కంప్యూటర్ వ్యవస్థలకు దూరంగా వుండాల్సిందిగా రాత్రికి రాత్రి 600మంది ఉద్యోగులకు ఆదేశాలు వెళ్ళాయని సంస్థలోని సిబ్బంది చెప్పారు. ఇంకా కంప్యూటర్లపై పనిచేస్తున్న వారికి ఇ మెయిల్స్ అందాయి. సంస్థ నాయకత్వం ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయం భవనాన్ని సోమవారం నుండి మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఆరు దశాబ్దాలుగా సాగుతున్న యుఎస్ ఎయిడ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థను మూసివేయడానికి ట్రంప్ అంగీకరించారంటూ సోమవారం తెల్లవారు జామున మస్క్ ప్రకటించారు. ఆ వెంటనే ఈ పరిణామాలన్నీ చోటు చేసుకున్నాయి.సంస్థకు సంబంధించిన రహస్య సమాచారం, పత్రాలను మస్క్ తనిఖీ బృందాలకు అప్పగించడానికి ఇద్దరు సెక్యూరిటీ చీఫ్‌లు నిరాకరించడంతో వారిద్దరిని ప్రభుత్వం శలవుపై పంపింది. ఆ నేపథ్యంలో మస్క్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. యుఎస్‌ఎయిడ్ సంస్థ ఒక నేర సంస్థ ఇక దాన్ని తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని మస్క్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే జారీ చేసిన ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా అమెరికా అందించే సహాయ కార్యకలాపాలకు కొత్తగా నిధులు అందించడాన్ని అమెరికా విదేశాంగ శాఖ స్తంభింపచేసింది. అమెరికా విధానాలకు అనుగుణంగా విదేశాలకు చేసే సాయం వుంటోందా లేదా అని సమీక్షలు జరుపుతున్న తరుణంలో ఈ చర్యలు, వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# దేవాలయ దొంగతనాల్లో నిందితుడి అరెస్ట్

## - పోలీసుల చాకచక్యంతో సుమారు 3.15 కిలోల వెండి, 3 మాసాల బంగారం స్వాధీనం

**ముధోల్ (మన వెలుగు )ఫిబ్రవరి 04 :** భైంసా పట్టణంలో నరసింహస్వామి, హనుమాన్, సంతోషిమాత, బాలాజీ దేవాలయాల్లో వరుసగా చోటుచేసుకున్న దొంగతనాల కేసును పోలీసులు తక్కువ కాలంలో ఛేదించారు. నిందితుడు విజయ్ షిండే అలియాస్ అశోక్‌ను ఫిబ్రవరి 4 తెల్లవారుజామున 1:00 గంటకు అరెస్టు చేశారు.పోలీసులు సాంకేతిక సహాయంతో దర్యాప్తు చేసి నిందితుడిని గుర్తించారు. అతని వద్ద నుంచి 3.15 కిలోల వెండి, 3 మాసాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. భైంసా పట్టణం కమ్యూనల్ సెన్సిటివ్ ఏరియా కావడంతో వరుస దేవాలయ దొంగతనాలు ప్రజల్లో భద్రతాపై సందేహాలు కలిగించాయని, అయితే తక్కువ సమయంలో కేసును ఛేదించడం ద్వారా అన్ని అనుమానాలకు తెరదించామని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల తెలిపారు.పెరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు భైంసాలో పెట్రోలింగ్ బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రజలు తమ నివాసాలు, వ్యాపార సముదాయాలు, ప్రార్థనా స్థలాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కేసును ఛేదించడంలో భైంసా ఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ ఇన్స్పెక్టర్ గోపీనాథ్, ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్,





పోలీస్ సిబ్బంది ప్రమోద్, హరిబాబు, అంబదాస్, సుభాష్, శివరాజ్, శరత్ చంద్ర, మహిళా పోలీసు సిబ్బంది అనిత, సంగీత, హెూంగార్డ్ గంగారావ్ ముఖ్య పాత్ర పోషించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

# మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయండి

**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 04:** భైంసా:ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్టభద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ 7న హైదరాబాద్లో జరగబోయే లక్షల డప్పులు వేల గొంతులు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం.ఎమ్మార్పీఎస్,ఎం యస్ పి జాతీయ నాయకుడు నందకుమార్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని.భైంసా ఐ బి విశ్రాంతిభవనం ముందర వాల్ పోస్టర్లను ఆవిష్కరించరు.ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ... మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో సుప్రీంకోర్టు ద్వారా తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఈ దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే ముందు తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణను అమలుపరుస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తానని ప్రగల్బాల్ పలికి చివరికి అన్ని రాష్ట్రాల కంటే వెనుక పడడం జరిగిందన్నారు.అదే క్రమంలో మాల ఎమ్మెల్యేల ఒత్తిడికి తళుగి మాదిగలకు నష్టం చేయడం జరిగిందన్నారు.ఈనెల జరగబోయే వెయ్యి గొంతులు లక్షల డప్పుల సంస్కృతిక మహా ప్రదర్శనను వేలాది మందితో అన్ని కుల సంఘాలతో ఈనెల 7 న ఎల్బీ స్టేడియం నుండి



అంబేద్కర్ విగ్రహం వరకు వేల గొంతులు లక్ష డప్పుల భారీ సాంస్కృతిక ప్రదర్శనను మాది ఉపకులాలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ ఎం యస్ పి జాతీయ నాయకుడు గడ్డం తుకారం, ఎమ్మార్పీఎస్ ఎం యస్ పి రాష్ట్ర సీనియర్ నాయకులు కత్తి బాబు మాదిగ,యం యస్ యఫ్ జిల్లా అధ్యక్షులు%ట%అన్నాభవు సాటే సేవ సమితి నిర్మల్ నామత్కార్ దిగంబర మాదిగ,ఎమ్మార్పీఎస్ ఎం యస్ పి సీనియర్ నాయకులు సాయిచంద్ మాదిగ,ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, ఆనందరావు,భోజరాం, తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్ మున్సిపల్ అధికారుల నోటా మనోడే అనే మాట

## - వాళ్ళు అంత మనవాళ్లే అంటూ మాట దాటేస్తున్న అధికారులు

## - సామాన్యుడికి ఒక న్యాయం బిల్డర్కు మరో న్యాయం

## - మల్లంపేట్ లో జరిగే అక్రమ భావన నిర్మాణాలపై నో యాక్షన్

## - ఏ మాత్రం సెట్ బ్యాక్ లేకుండా అంతస్తులపై అంతస్తులు

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) ఫిబ్రవరి 04 :**
దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ పరిధిలో పెండాలిమడుగు సాయి సుందర్ నగర్ ప్లాట్ నెంబర్ 36/బి లో అలాగే మల్లంపేట్ శ్రీ సాయి బాలాజీ ఎంక్లేవ్ లో అనుమతులు మించి అక్రమ అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతున్న నోరు మెదపని పట్టణ ప్రణాళిక అధికారులు , మేము ఎవ్వరికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు మా బిల్డింగ్ మా ఇష్టం మీరు ఎవరు మమల్ని ప్రశ్నించడానికి అని స్థానికుల పై విరుచుకు పడుతున్న బిల్డర్లు , అన్నిటికి అనుమతులు ఉన్నాయ్ మేమే ఇచ్చాము అంటున్న అధికారులు, ఇది ఇలా ఉండగా సెట్ బ్యాక్ లేని అంతస్థులుపై స్థానికుల ఆరోపణలు చేస్తే కూడా ఎంటువంటి సమాధానం ఇవ్వని అధికారుల భవనాలపై యాక్షన్ తీసుకోకుండా బిల్డర్లకు సలహాలు ఇస్తున్నారు అధికారులు నిర్మాణ అనుమతుల జీం3 ఉంటే జీం5 నిర్మాణాలు చేపడుతున్నారు ఇంకో పక్కన సెట్ విష్యానికి వస్తే ఇక్కడ ఏ ఒక్క నిర్మాణానికి కూడా సెట్ బ్యాక్ లేదు అని అర్ధమవుతుంది ముందు భాగం లో, సైడ్ భాగం లో , వెనుక భాగం లో, జీరో సెట్ బ్యాక్ తూచ తప్పకుండ పాటించవలసిన నియమాలను గాలికి వదిలేసి కాసుల మత్తులో మునిగిన అధికారులు బిల్డర్లకు వత్తాసు పలుకుతూ మీకు ఏమికాదు మేము చూసుకుంటాం అని బిల్డర్లకు హామీ ఇస్తున్నారు ఒక బిల్డింగ్ నిర్మాణా సమయంలో రోడ్డు విస్తరణ చుటు సెట్ బ్యాక్లు ఏమి గమనించకుండా పర్మిషన్లు ఇచ్చేస్తున్నారు అటుగా ఒక కారు వస్తే ఇంకో ద్విచ్చక్ర వాహనం వెళ్ళడానికి దారి లేని మార్గంలో జోరుగా నిర్మాణాలు సాగుతున్నాయి రోడ్డు విస్తరణ 12 అడుగులు మాత్రమే ఉన్న ఒక చిన్న సందులో జీం5 నిర్మాణాలు చేపట్టడం విశేషం ఇది ప్రమాదలు సంభావిస్తే సదరు నిర్మాణం తో పాటు పక్కనే ఉన్న పలు రెసిడెన్సియల్ భవనాలకు కూడా ప్రమాదం చుట్టుకునే అవకాశం ఉంది అయితే ఎక్కడ నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు ఆ నిర్మాణాలను నిలిపివేసి బిల్డర్లపై కేసులు బుక్ చేయమని అధికారులును సామాన్యులు వెళ్లి ప్రశ్నించగా మేము సెర్వే చేసి మీకు వివరణ ఇస్తాము మీరు ఒక నాలుగు రోజులు ఆగి రండి అనంతరం వారి వెళ్లి ఆడిన మేము





వెళ్లి సెర్వే చేసాము అది క్లీన్ చీట్ ఉంది అని సమాధానం ఇస్తున్న అధికారులు ఇక ఏమి తోచని సామాన్యులు వీళ్ళ దగ్గరే న్యాయం జరగక పోతే ఇంకెవరి దగ్గరికి వెళ్లి మన మొర ఆలకించు కోవాలి అని అయోమయ పరిస్థులలో ఉన్నరు సామాన్యులు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేసిన మోహన్ రావ్ పటేల్

**ముధోల్ ( మన వెలుగు ) ఫిబ్రవరి 04 :** భైంసా మండలం మిర్జాపూర్ గ్రామం లోని జెడ్పి ఉన్నత పాఠశాల, మహాగంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా కుబీర్ మండలంలోని పార్డీ (బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎల్ బి ఎం ఉన్నత పాఠశాల లో 10వ తరగతి చదువుతున్నవిద్యార్థిని విద్యార్థులకు మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి ఎగ్జామ్స్ ప్యాడ్స్ అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావ్ పటేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు నేర్పించే పాఠాలను శ్రద్ధతో విని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు.




# ముధోల్ పంచాయతీ కార్యదర్శికి సన్మానం

**ముధోల్, ( మన వెలుగు ) ఫిబ్రవరి 04 :** ముధోల్ గ్రామపంచాయతీ సెక్రటరీ అన్వర్ అలీ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముధోల్ మాజీ ఉప సర్పంచ్ సంజీవ్ కుమార్ సెక్రటరీ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లడుతూ అందరి సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు )ఫిబ్రవరి 04 :** కలెక్టర్ అభిలాష అభినవ్ క్యాన్సర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఫిబ్రవరి 4, ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం, ముందస్తు వైద్య పరీక్షల ద్వారా క్యాన్సర్ నివారించవచ్చని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు.ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న క్యాన్సర్ పై అవగాహన పెంచేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తామని, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా క్యాన్సర్ రాకుండా చూసుకోవాలని సూచించారు.క్యాన్సర్ వ్యాప్తికి మారుతున్న జీవనశైలి ప్రధాన కారణమని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా దీని నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ముందస్తు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం వల్ల క్యాన్సర్ ను తొందరగా గుర్తించి సరైన చికిత్స పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో




ఉచిత క్యాన్సర్ పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లతో చర్చించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్యులు రోగుల పట్ల సేవా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, వైద్యులు శ్రీనివాస్, తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీఓ సురేష్, ఆసుపత్రి సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి శ్వేతా పత్రాన్ని విడుదల చేసి పోటీలో నిలవాలి

**నిర్మల్ (మన వెలుగు) ఫిబ్రవరి 04 :** తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉచిత విద్యను అందించారో శ్వేత పత్రంను విడుదల చేసి కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ ఎమ్మెల్సీ గా పోటీ చేయాలని పట్టభద్రుల సంఘము నిర్మల్ జిల్లా నాయకులు చాకటి లస్మన్న ,శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మంది తల్లిదండ్రుల నుండి లక్షల్లో ఫీజులు వసూలు చేసి డబ్బు సంపాదన ధ్యేయంగా విద్య సంస్థలను స్థాపించిన నరేందర్ రెడ్డి కి కాంగ్రెస్ అధిష్టానం ఎలా ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చిందో చెప్పవలసిన బాధ్యత కాంగ్రెస్ అధిష్టానం పైన ఉందని ఆయన అన్నారు. ఒక్క పక్క ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రతి సారి చెప్పే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ మాత్రం కార్పొరేట్ విద్య సంస్థల అధిపతి అయిన నరేందర్ రెడ్డి కి ఎలా



ఇచ్చారని ప్రశ్నించారు.

# కారు బైక్ ఢీకొని ఇద్దరు మృతి

## - అక్కడికక్కడే మృతి చెందిన ఎస్ఐ శ్వేత, బ్యాంక్ ఉద్యోగి నరేశ్

**గొల్లపెల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 04 :** కారు బైక్ ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.... జగిత్యాల డిసిఆర్బీ లో ఎస్ఐ విధులు నిర్వహిస్తున్న శ్వేత తన గ్రామం ఆర్మకొండ నుండి జగిత్యాల కు వస్తుండగా మార్గమధ్యలో చిల్వకోడూరు గ్రామ శివారులో ఎదురుగా బైక్ పై వస్తున్న ముత్యంపేట గ్రామానికి చెందిన మల్యాల నరేష్ ( ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి) ముత్యంపేట నుండి లక్షెట్టిపేటకు తన బైక్ పై మీద వెళు తుండగా కారు బైక్ రెండు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఎస్ఐ శ్వేత మరియు బైక్ నడుపుతున్న నరేష్ ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి





చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పోస్ట్ మార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ శ్వేత కోరుట్ల, వెల్గటూరు, కథలాపూర్, పెగడపల్లిలో ఎస్ఐగా పని చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేపై మండిపడ్డ

## జగిత్యాల జిల్లా బిసి సంక్షేమ సంఘం నాయకులు



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) ఫిబ్రవరి 04 :** జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన జగిత్యాల జిల్లా బిసి సంక్షేమ సంఘం సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే నివేదిక తప్పుల తడక అని అన్నారు. 56 శాతానికి పైగా ఉన్న బీసీలను 46.2 శాతంగా చూపిస్తారా అని డిమాండ్ చేశారు. సర్వే పూర్తిస్థాయిలో పూర్తికాకుండానే లెక్కచెప్పడం వెనుక కుట్ర ఉన్నది అని అన్నారు. బీసీలకు రిజర్వేషన్ల పెంచాల్సి వస్తదని తూతూ మంత్రంగా సర్వే నిర్వహించడం బాధాకరం అని అన్నారు. మన రిజర్వేషన్లు సాధించుకోవడానికి బిసి కులసంఘాలు ఏకమై పోరాటం చేయడానికి సిద్ధం కావాలి అని పిలుపునిచ్చారు. 42 శాతం కోటా ఇవ్వకుంటే రణరంగమే అని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా తాజాగా చేసిన బడ్జెట్ లో కేవలం రూ. 2500 కోట్లు మాత్రమే కేటాయించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర బిసి ల అభివృద్ధి కోసం కేంద్రం తక్కువగా బడ్జెట్ కేటాయించడం వివక్షరమని బిసి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కేటాయింపులు బిసి ల సంక్షేమానికి సరిపోవని, సామాజిక న్యాయానికి పెద్ద ద్రోహమని నేతలు ఆరోపించారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న పంచాయతిరాజ్ ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుంటే ఆమరణ నిరాహారదీక్షలు చేపడుతామని, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా బిసిల ఆత్మగౌరవంతో ఈ ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బి.సి మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా (న్యాయవాది), బిసి సంక్షేమ సంఘం సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేష్ కుమార్, బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, అనుమల్ల సంజయ్ సామ్రాట్, బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, బిసి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, బండపెల్లి నర్సయ్య, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇలాంటి ఇన్నింగ్స్ నేనెప్పుడూ చూడలేదు




ఐదు టీ20ల సిరీస్‌లో బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ ఇంగ్లండ్ తేలిపోయింది. చివరి టి20లో భారత్ చేతిలో చిత్తుచిత్తుగా ఓడి ఘోరపరాభావాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 247 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం లక్ష ఛేదనకు దిగిన ఇంగ్లండ్ జట్టు కేవలం 10 ఓవర్లలోనే 97 పరుగులకే చాపచుట్టేసింది. అయితే భారత బ్యాటర్లలో అభిషేక్ శర్మ 135 ( 54 బంతుల్లో 7ఐ4, 13ఐ6) మెరుపు సెంచరీతో చెలరేగగాడు. ఇక ఈ మ్యాచ్ అనంతరం ఇంగ్లండ్ సారథి జోస్ బట్లర్ మాట్లడుతూ.. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్ శర్మపై ప్రశంసల వర్షం కురిపించాడు. అభిషేక్ శర్మ గురుంచి ఎంత చెప్పుకున్న తక్కువే. నేను ఇప్పటివరకు నా కెరీర్‌లో ఎంతో క్రికెట్ చూశాను. కానీ టీ20ల్లో అభిషేక్ శర్మ లాంటి విధ్వంసకర ఇన్నింగ్స్‌ను చూడడం ఇదే తొలిసారి' అని బట్లర్ అన్నాడు.

# పటిష్ఠంగా టీమిండియా ఆతిథ్య జట్టుకు సవాల్ వంటిదే



ఐదు టి20ల సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకొని ఘనంగా ముగించిన భారత్ ఇప్పుడు మరో ఔమరానికి సిద్ధమైంది. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. మరో రెండు వారాల్లో ప్రారంభంకానున్న ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు జరుగబోయే ఈ సిరీస్ టీమిండియాకు కీలకంగా మారింది. ఈ నెల 6వ తేదీ నుంచి ఈ సిరీస్ షురూకానుంది. నాగ్‌పూర్ వేదికగా జరిగే తొలి వన్డేతో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో బరిలోకి దిగే భారత జట్టే ఈ సిరీస్ ఆడనుంది. మెగా టోర్నీకి ముందు ఈ మూడు వన్డేలను టీమిండియా సన్నాహకంగా ఉపకరించనుంది. అయితే.. పొట్టి సిరీస్‌కు దూరంగా ఉన్న సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ ఈ సిరీస్‌తోనే రీఎంట్రీ ఇవ్వనున్నారు. దాంతో టీమిండియా కాంబినేషన్ ఎలా ఉంటుదనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వెన్ను నొప్పితో జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నాడు. దాంతో పేస్ విభాగాన్ని ఎవరు నడిపిస్తారనేది కూడా చర్చనీయాంశమైంది. అయితే ముగిసిన టి20 సిరీస్‌లో సీనియర్ పేసర్ మహ్మద్ షమీ జట్టులో చేరిన సంగతి తెలిసింది. ఈ సిరీస్‌లోనూ షమీ కొనసాగిస్తారా లేదా అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్‌లో రోహిత్ శర్మకు జతగా ఎవరు ఓపెనింగ్ చేస్తారు? వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్, కెఎల్ రాహుల్‌లో ఎవరికి చోటు దక్కుతుందనేది కీలకంగా మారింది. ఈ సందేహాలన్నింటికీ ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో పరిష్కారం లభించనుంది. ఇప్పటికే ఈ సిరీస్ బరిలో నిలిచే ఆటగాళ్లు నాగ్‌పూర్ చేరుకొని బిసిసిఐ నిర్వహిస్తున్న ప్రీ- ప్రాక్టీస్ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఓపెనింగ్ జోడీలో లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం చూస్తే.. యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడని తెలుస్తోంది.

# వెలిగిన వింటర్ గేమ్స్ జ్యోతి



9వ ఆసియా శీతాకాల(వింటర్)గేమ్స్ చైనాలోని హర్బిన్ వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం జరిగిన ప్రారంభోత్సవాల జ్యోతి(టార్చ్) రిలే హర్బిన్‌లోని బరోక్ బ్లాక్‌లో ప్రారంభమై మొత్తం 11 కిలోమీటర్లు పయనించి సొంగ్హువా నది వద్ద గల వెట్‌ల్యాంట్ పార్క్‌లోని ప్రసిద్ధ స్నోమాన్ స్క్వేర్‌కు చేరుకుంది. జావోలిన్ పార్క్, సెంట్రల్ స్ట్రీట్‌లను దాటి వచ్చింది. టార్చ్‌ను తొలుత చైనా మాజీ మహిళా స్కేటర్ షెన్ జు అందుకొని రిలేలో పాల్గొన్నారు. మొత్తం 120మంది టార్చ్ బేరర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టార్చ్ చైనాలో నగరాలన్నీ తిరిగి సాయంత్రం హర్బిన్‌కు చేరుకుంది. మంగళవారం జరిగే మిక్స్‌డ్ డబుల్స్ కర్లింగ్ రౌండ్ రాబిన్ లీగ్‌లో ఆతిథ్య చైనా జట్టు బరిలోకి దిగనుంది. తొలి బంగారు పతకాన్ని 8వ తేదీ ఉదయం ప్రదానం చేయనున్నారు. వింటర్ గేమ్స్ చరిత్రలో 1,270మంది అథ్లెట్లు పాల్గొనడం ఇదే తొలిసారి. భారత్‌నుంచి మొత్తం 76మంది వింటర్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ఇందులో పురుషుల విభాగంలో 54మంది, మహిళల విభాగంలో 22మంది పతకాలకు పోటీపడనున్నారు. అప్లినే స్కేటింగ్, క్రాస్ కంట్రీ, ఫిగర్ స్కేటింగ్, ఐస్ హాకీ, షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్, స్కీ మౌంటేనిరంగ్, స్నో బోటింగ్, స్పీడ్ స్కేటింగ్ విభాగాల్లో భారత అథ్లెట్లు పతకాల రేసులో ఉన్నారు. 9వ ఆసియా వింటర్ గేమ్స్ ఫిబ్రవరి 7 నుంచి 14వరకు జరగనున్నాయి.

# వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య



**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) ఫిబ్రవరి 04 :**వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇబ్రహీంపట్నం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన నునావత్ సునీత తన భర్తతో 8 సంవత్సరాల క్రితం విడాకులు తీసుకొని డబ్బా గ్రామంలోని తన అన్నదమ్ముల స్థలంలో రేకుల షెడ్డు వేసుకొని తన కూతురు అంజలి (10) తో కలిసి జీవిస్తుంది. కాగా సునీతకు గత కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ హాస్పిటల్ కి వెళ్లి చికిత్స చేయించుకోవడానికి డబ్బులు లేక పోవడంతో మానసికంగా కృంగిపోయి మంగళవారం తన కూతురు అంజలి స్కూల్ కి వెళ్ళిన తర్వాత తన ఇంట్లో చీరతో ఊరికి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.సునీత కూతురు అంజలి మధ్యాహ్నం తినడానికని ఇంటికి రాగా తలుపు ఎంత కొట్టిన సునీత తలుపు తియ్యకపోవడంతో తన కూతురు అంజలి తన మేనమామలను పిలువగా వారు తలుపులు పగలగొట్టి చూడగా సునీత అప్పటికే మృతి చెందింది. మృతురాలి అన్న భూక్య కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

# నా ప్రతి విజయంలో మా నాన్న




అండర్ 19 వరల్డ్ కప్ సత్తా చాటిన తెలంగాణ క్రికెటర్ గొంగడి త్రిషకు ఘన స్వాగతం లభించింది. మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు అండర్ 19 ఉమెన్ ప్లేయర్స్ త్రిష, ధ్రితి కేసరి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్లేయర్స్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్వాగతం పలికింది. అనంతరం త్రిష మీడియాతో మాట్లాడుతూ.. "మేం పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కింది. ఇకనుంచి మరింత కష్టపడి సీనియర్ టీమ్‌లో చోటు సాధించడమే లక్ష్యం. మ్యాచ్ లో ఎలాంటి ఒత్తిడిని తీసుకోలేదు. ప్రతి మ్యాచ్‌లో మా పాత్ర ఏంటి అని మాత్రమే ఆలోచించాం. ఈసారి ధృతికి అవకాశం రాలేదు కానీ. తను చాలా మంచి ప్లేయర్. నా ప్రతి విజయంలో మా నాన్న ఉన్నారు" అని తెలిపింది. కాగా.. భారత్ రెండోసారి అండర్ 19 వరల్డ్ కప్ నెగ్గడంలో గొంగడి త్రిష కీలక పాత్రపోషించింది. సంచలన బ్యాటింగ్‌తో పాటు అసాధారణ బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఫైనల్లోనూ గొంగడి త్రిష(33 బంతుల్లో 8ఐ4తో 44 నాటౌట్) అదరగొట్టింది. బౌలింగ్‌లోనూ 3 వికెట్లు తీసింది. టైటిల్ సాధించిండలంలో కీ రోల్ పోషించిన త్రిష ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# సత్యజ్యోతికి కాంస్యం



38వ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మరో పతకం దక్కింది. వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రకు చెందిన సత్యజ్యోతి కాంస్య పతకం చేజిక్కించుకుంది. దీంతో ఆంధ్ర పతకాల సంఖ్య మూడుకు చేరింది. బుధవారం జరిగిన 87 ప్లస్ కిలోల కేటగిరీలో విజయనగరం జిల్లాకు చెందిన టి.సత్యజ్యోతి విజయ ఢంకా మోగించింది. కాంస్యం పథకం సాధించి రాష్ట్రానికి గర్వ కారణంగా నిలిచింది. సత్యజ్యోతికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ట్విటర్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఎపికి పురుషుల 67 కిలోల విభాగంలో నీలం రాజు, 71 కేజీల మహిళల విభాగంలో పల్లవి ఇప్పటికే స్వర్ణ పతకాలు గెలిచిన సంగతి తెలిసిందే. జాతీయ క్రీడల్లో ఓ సంచలనం నమోదైంది. పురుషుల 10మీ. ఎయిర్ పిస్టల్ విభాగంలో 15ఏళ్ల జొనాథన్ గవిన్ ఆంటోనీ టోక్యో ఒలింపియన్ సౌరబ్ చౌదరిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరాడు. ఇరువురు 578పాయింట్లతో సమంగా నిలువగా.. షూట్ ఆఫ్‌లో జొనాథన్ టార్గెట్‌కు దగ్గరగా చివరి బుల్లెట్‌ను కొట్టాడు. ఈ ఏడాది బోర్డు పరీక్షలకు సిద్ధమౌతున్న జొనాథన్‌కు ఈ గెలుపు ఎంతో ప్రత్యేమైనది. ఫైనల్‌కు చేరిన 8మందిలో సీనియర్ ఆటగాడు, జాతీయ క్రీడల స్వర్ణ పతక విజేత సరబ్‌జ్యోతి సింగ్ కూడా ఉన్నారు.

# బుమ్రా యాక్షన్‌తో వరల్డ్ కప్ విన్నర్‌కు షాక్..




జస్ప్రీత్ బుమ్రా తన అద్భుతమైన బౌలింగ్‌తో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాకు పెద్ద సమస్యగా మారాడు. 32 వికెట్లు తీసి, మూడు ఐదు వికెట్ల ప్రదర్శనలతో భారత బౌలింగ్ దళానికి ప్రధాన బలం అయ్యాడు. మిచెల్ మార్ష్ మేనల్లుడు కూడా బుమ్రా యాక్షన్ అనుకరించడం ఆసక్తికరంగా మారింది. మార్ష్ ఈ సిరీస్‌లో ఘోరంగా విఫలమై, చివరి టెస్ట్‌కు జట్టులో నుంచి తప్పించబడ్డాడు. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా బ్యాటర్లకు నిజమైన పీడకలగా మారాడు. ఈ సిరీస్‌లో 32 వికెట్లు తీసి భారత బౌలింగ్ దళానికి అగ్రభాగంగా నిలిచాడు. బుమ్రా ప్రభావం కేవలం మైదానంలోనే కాదు, ఆస్ట్రేలియన్ క్రికెటర్ల కుటుంబాల్లో కూడా కనిపించింది. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ ఒక సరదా సంఘటన ద్వారా వివరించాడు. "నా నాలుగేళ్ల మేనల్లుడు టెడ్‌తో బ్యాక్‌యార్డ్ క్రికెట్ ఆడుతున్నప్పుడు, అతను బుమ్రా యాక్షన్‌ను అనుకరించడం మొదలు పెట్టాడు! అది చూసి నాకు నిజంగా షాక్ తగిలింది. బుమ్రాను ఎదుర్కొనడం ఎలా ఓ పీడకలగా మారిందో మళ్లీ గుర్తొచ్చింది" అని మార్ష్ హాస్యాస్పదంగా చెప్పాడు. 2024-25 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా ఐదు మ్యాచ్‌ల్లో 13.06 సగటుతో 32 వికెట్లు తీసి, మూడు ఐదు వికెట్ల ప్రదర్శనలు చేశాడు. తన అత్యుత్తమ గణాంకంగా 6/76 నమోదు చేశాడు. ఈ సిరీస్‌లో అతను అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అంతేకాదు, విదేశీ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారతీయుడిగా బిషన్ సింగ్ బేడిని అధిగమించాడు. ఇదే సిరీస్‌లో మిచెల్ మార్ష్ పూర్తిగా విఫలమయ్యాడు. నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం 73 పరుగులు మాత్రమే చేసి, అతని సగటు 10.42 గా నమోదైంది. అతని అత్యధిక స్కోరు 47 మాత్రమే. బౌలింగ్‌లో కూడా మూడే వికెట్లు తీసి, 46.33 సగటుతో పేలవ ప్రదర్శన చేశాడు. దాంతో, దీ+ు చివరి టెస్ట్‌కు అతన్ని జట్టు నుంచి తప్పించి బ్యూ వెబ్‌స్టర్‌ను జట్టులోకి తీసుకువచ్చారు. గత ఏడాది మార్ష్ ఆస్ట్రేలియన్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా అలన్ బోర్డర్ మెడల్ గెలుచుకున్నప్పటికీ, ఈ సిరీస్‌లో అతని ఫామ్ పూర్తిగా క్షీణించింది. "డిసెంబర్ ముందు, నాకు అభిమానుల నుండి ఎంతో ప్రేమ లభించింది. కానీ డిసెంబర్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది!" అని మార్ష్ సరదాగా వ్యాఖ్యానించాడు. జస్ప్రీత్ బుమ్రా అద్భుతమైన బౌలింగ్‌తో ఆస్ట్రేలియాకు ఎంతటి ముప్పుగా మారాడో ఈ సిరీస్ స్పష్టంగా చూపించింది. మిచెల్ మార్ష్ కేవలం మైదానంలోనే కాదు, తన కుటుంబంలో కూడా బుమ్రా ప్రభావాన్ని అనుభవించాడు.

# అందనంత ఎత్తుకు పసిడి...!



గోల్డ్ ధర పెరగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయంగా నెలకొంటున్న పరిస్థితులే అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు జనం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఈ కారణంగా కూడా బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం ఉదయానికి బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం. బంగారం ధరలు భారీగా పెరుగుతూ పోతున్నాయి. ఆకాశమే హద్దుగా పసిడి ధరలు దూసుకెళు న్నాయి. గోల్డ్ ధర ఏకంగా లక్షకు చేరువవుతోంది. దీంతో అటు పసిడి ప్రియులకు కొనాలంటే భగ్గుమంటున్న ధరలతో చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లో గోల్డ్ రేట్స్ ఆల్ టైం రికార్డ్ స్థాయిని తాకడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోల్డ్ ధర పెరగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయంగా నెలకొంటున్న పరిస్థితులే అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు జనం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. . ఈ కారణంగా కూడా బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం ఉదయానికి బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం. భారతదేశ వ్యాప్తంగా ఈరోజు బంగారం ధరలు పరిశీలించినట్టయితే.. 22 క్యారెట్ల బంగారం ధర 1 గ్రామురూ. 7,704లుగా కాగా, 24 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ. 8,404 లుగా పలుకుతోంది. ఇక దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో పసిడి ధరలు ఎలా ఉన్నాయో పరిశీలించినట్టయితే..హైదరాబాద్‌లో 10 గ్రాముల పసిడి 22క్యారెట్లు ధర రూ. 77,040గా ఉంది. 24క్యారెట్ల బంగారం ధర రూ. 84,040గా కొనసాగుతోంది. విజయవాడలో 10 గ్రాముల పసిడి 22క్యారెట్లు ధర రూ. 77,040గా ఉంది. 24క్యారెట్ల బంగారం ధర రూ. 84,040గా కొనసాగుతోంది. విశాఖపట్నంలోనూ ఇవే రేట్లు కొనసాగుతున్నాయి. 10 గ్రాముల పసిడి 22క్యారెట్లు ధర రూ. 77,040గా ఉంది. 24క్యారెట్ల బంగారం ధర రూ. 84,040గా కొనసాగుతోంది. వరంగల్‌లో 10 గ్రాముల పసిడి 22క్యారెట్లు ధర రూ. 77,040గా ఉంది. 24క్యారెట్ల బంగారం ధర రూ. 84,040గా కొనసాగుతోంది.

# డీప్ సీక్ ఏఐకు షాక్.. డేటా చోరీ

## ఆరోపణల నేపథ్యంలో నిషేధం




ఏఐ రంగంలో చాట్ జీపీటీకు ఇటీవల చైనాకు సంబంధించిన డీప్ సీక్ పరుగులు పెట్టించిన సంగతి అందరికీ తెలిసిందే. చాట్ జీపీటీకు ప్రత్యామ్నాయంగా డీప్ సీక్ ఆదరణ పొందుతుందని అందరూ అనుకున్నారు. అయితే డీప్ సీక్‌పై డేటా చౌర్యం ఆరోపణల నేపథ్యంలో నిషేధం విధించారనే వార్త టెక్ వర్గాల్లో సంచలనంగా మారింది. డీప్‌సీక్ ఆర్1, చైనీస్ ఏఐ మోడల్ ఇది చాలా తక్కువ వ్యవధిలో వేగంగా ప్రజాదరణ పొందింది. చైనాకు వినియోగదారుల డేటాను పంపిందనే ఆరోపణలపై ఇప్పుడు డీప్ సీక్‌పై నిషేధం విధించారు. గత వారం సిలికాన్ వ్యాలీలో సంచలనం సృష్టించిన ఏఐ సాధనం యూఎస్ అధికారులు భద్రతాపరమైన ప్రమాదాన్ని గుర్తించారు. టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ జాతీయ భద్రతా సమస్యలను చూసిన తర్వాత అధికారికంగా ప్లాట్‌ఫారమ్‌ను ఏ ప్రభుత్వ పరికరాల్లో ఉపయోగించకుండా నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో డేటా గోప్యతా ప్రమాదాల కారణంగా చైనీస్ ఏఐ సాధనాలను పరిమితం చేయాలనే డిమాండ్లు మళ్లీ వెలుగులోకి వచ్చాయి. డీప్‌సీక్ ఆర్1 కాకుండా టెక్సాస్ సంభావ్య ముప్పులుగా లేబుల్ చేసిప శఋశీష్ట్రశీఅస్త్రంష్ట్రబ, రెడ్ నోట్, లెమన్ 8లను నిషేధించింది. ఈ ప్లాట్‌ఫారమ్‌లు చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ (సీసీపీ)తో ముడిపడి ఉన్నాయని ఆరోపించినందున, ఇది కీలకమైన యూఎస్ మౌలిక సదుపాయాలను రాజీ చేయగలదని గవర్నర్ అబాట్ పేర్కొన్నారు. సున్నితమైన వినియోగదారు డేటాను సేకరించేందుకు చైనా ఏఐ, సోషల్ మీడియాను ఉపయోగిస్తుందనే భయంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెబుతున్నారు. అమెరికాలో ఇటీవల టిక్ టాక్ తన సేవలను వెనక్కి తీసుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సమయంలో అమెరికా యూజర్లకు శఋశీష్ట్రశీఅస్త్రంష్ట్రబ బలమైన ప్రత్యామ్నాయంగా మారింది. దాదాపు 300 మిలియన్ల రోజువారీ యాక్టివ్ యూజర్‌లను కలిగి ఉన్న ఈ చైనీస్ యాప్ ఇప్పటికే చైనా, మలేషియా, తైవాన్‌లలో ప్రజాదరణ పొందింది. అయినప్పటికీ పెరుగుతున్న భద్రతా సమస్యల కారణంగా యూఎస్ అధికారులు ఇప్పుడు దాని కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. టిక్ టాక్ మాతృ సంస్థ బైట్ డ్యాన్స్‌కు చెందిన నిషేధిత యాప్ లెమన్ 8 ఇప్పటికే వినియోగదారు డేటాను దుర్వినియోగం చేస్తుందని ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..

## ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..




అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లు సాగిస్తుండడంతో మంగళవారం ఉదయం దేశీయ సూచీలు లాభాల బాటలో సాగుతున్నాయి. ఈ వారంలో 5,6 తేదీలలో ఆర్బీఐ ద్రవ్యపరపతి మీటింగ్ జరగనుంది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లు సాగిస్తుండడంతో మంగళవారం ఉదయం దేశీయ సూచీలు లాభాల బాటలో సాగుతున్నాయి. ఈ వారంలో 5,6 తేదీలలో ఆర్బీఐ ద్రవ్యపరపతి మీటింగ్ జరగనుంది. కీలక వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తోంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో మొదలయ్యాయి.. సోమవారం ముగింపు (77, 186)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం 500 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత లాభాల్లోకి దూసుకెళ్లింది. ఒక దశలో దాదాపు 750 పాయింట్లుకు పైగా లాభపడి 77, 951 వద్ద గరిష్టానికి చేరుకుంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో 692 పాయింట్ల లాభంతో 76, 878 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 204 పాయింట్లు లాభపడి 23, 565 వద్ద కొనసాగుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్ తదితర హెవీ వెయిట్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను లాభాల వైపు నడిపిస్తున్నాయి. సెన్సెక్స్‌లో మదర్సన్, సోనా బీఎల్‌డబ్ల్యూ, ఏబీబీ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ట్రెంట్, టాటా కెమికల్స్, బర్గర్ పెయింట్స్, యునైటెడ్ బ్రూవరీస్ షేర్లు భారీ నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 898 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 743 పాయింట్ల లాభంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ ప్రస్తుతానికి 87.02గా ఉంది.

# లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో కొనసాగుతున్నాయి. నేటి ఉదయం 9:30 సమయానికి నిఫ్టీ 231 పాయింట్లు నష్టపోయి 23,253కు చేరింది. సెన్సెక్స్ 682 పాయింట్లు దిగజారి 76,802 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 108.71 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 75.5 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.57 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో నష్టాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.76 శాతం నష్టపోయింది. నాస్‌డాక్ 1.2 శాతం దిగజారింది. కొత్త ఏడాదిలో తొలిసారి పరపతి సమీక్షను చేపట్టనున్న రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం (7న) విధాన నిర్ణయాలను ప్రకటించనుంది. దాదాపు ఐదేళ్ల తదుపరి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత 11 సమావేశాలలో వడ్డీ రేట్లకు కీలకమైన రెపోను 6.5 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి కాలంలో రెపో రేటులో 2.5 శాతం కోతను అమలు చేసింది. రిటైల్ ధరల ఇండెక్స్ (సీపీఐ) డిసెంబర్‌లో 4 నెలల కనిష్టం 5.22 శాతానికి దిగివచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 4 శాతానికి పరిమితంకానున్న అంచనాల నేపథ్యంలో ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

# ట్రంప్ చిచ్చులకు రూపాయి చిత్తు

## ఆందోళనేమీ లేదన్న ఆర్థిక శాఖ కార్యదర్శి



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిచ్చులకు రూపాయి చిత్తడి అవుతోంది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు అదోపాతాళానికి పడిపోతుంది. సోమవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 55 పైసలు క్షీణించి 87.17కు దిగజారి.. ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. కెనడా, మెక్సికోలపై 25 శాతం, చైనాపై 10 శాతం చొప్పున ట్రంప్ టారీఫ్‌ల పెంపు ప్రకటనతో భారత కరెన్సీ తీవ్ర ప్రభావితమయ్యింది. భారత్‌కు ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామి అని గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వ వర్గాలకు ట్రంప్ టారీఫ్‌ల చర్యలతో రూపాయి పతనం, మార్కెట్ల క్షీణతతోనైనా మేలుకొలుపు కావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 87 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.29కి పడిపోయింది. తుదకు 55 పైసలు కోల్పోయి 87.17 వద్ద ముగిసింది. ఇది భారత రూపాయి చరిత్రలోనే అత్యంత పేలవమైన ప్రదర్శన. ఇంత జరుగుతున్నా భయపడాల్సిందేమీ లేదని ఆర్థిక శాఖ కార్యదర్శి తూహిన్ కాంత పాండే పేర్కొనడం గమనార్హం. శుక్రవారం సెషన్‌లో 86.62 వద్ద ముగిసింది. భారత స్టాక్ మార్కెట్ల నుంచి భారీగా విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐ)లు తరలిపోవడానికి తోడు అమెరికా టారీప్‌ల భయాలు, డాలర్‌కు విలువ పెరగడం తదితర పరిణామాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేశాయని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ముడి చమురు బ్యారెల్ ధర 1.41 శాతం పెరిగి 76.74 వద్ద ముగిసింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే డాలరుతో రూపాయి విలువ 90కి చేరినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని నిపుణులు పేర్కొంటున్నారు. రూపాయి ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని, వచ్చే 6-8 వారాల పాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని ఆర్‌బిఎల్ బ్యాంక్ ట్రెజరీ హెడ్ అన్షులచెందక్ పేర్కొన్నారు.

# ఐటీలో నియామకాలు పెరుగుతున్నాయ్

ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో మళ్లీ నియామకాలు ఊపందుకున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) డైరెక్టర్ కవిత తెలిపారు. సోమవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ సర్వీసులు సహా అన్ని విభాగాల్లో రిక్రూట్‌మెంట్స్ తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయన్నారు. గతంలో కొంత స్తబ్దత నెలకొన్నప్పటికీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రధానంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)లో పెద్దఎత్తున ఏర్పాటు అవుతుండటంతో పాటు ఉద్యోగాల కల్పన కూడా అదే స్థాయిలో ఉంటోందని తెలిపారు. హైదరాబాద్‌లో దాదాపు 110 జీసీసీలు ఉండగా నియామకాల్లో వాటి వాటా 25 శాతం వరకు ఉందన్నారు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం దేశ ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 16.8 శాతంగా ఉందని కవిత తెలిపారు. ఇందులో జీసీసీల వాటానే 38 శాతం వరకు ఉందని ఆమె పేర్కొన్నారు. కొత్త జీసీసీలు పెద్దఎత్తున ఏర్పాటు కానుండటంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ వాటా మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆమె చెప్పారు. 11న హైసియా జాతీయ సమ్మిట్: ఈ నెల 11న హైదరాబాద్‌లో 32వ హైసియా జాతీయ సదస్సు, అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హైసియా ప్రెసిడెంట్ ప్రశాంత్ నందెళ్ల తెలిపారు. ఏఐ అండ్ బియాండ్: రీడిఫైనింగ్ ది ఫ్యూచర్ పేరుతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సదస్సులో భాగంగా లైఫ్ సైన్సెస్, సస్టేనబల్ సిస్టమ్స్, గ్రీన్ సాఫ్ట్‌వేర్, సిటీ సర్వీసులు, ఈ-గవర్నెన్స్ విభాగాల్లో ఏఐ ద్వారా వస్తున్న మార్పులపై విస్తృత స్థాయిలో చర్చాగోష్ఠిని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

